https://teluguislam.net



# దైవధర్మంలో తండోపతండాలుగా ప్రజల ప్రవేశం

మేము ఇదివరకే చెప్పినట్లుగా మక్కా విజయం ఓ నిర్ణయాత్మకమైన మలుపు. ఆ విజయం విగ్రహారాధనను సమూలంగా తుడిచివేసింది. అరేబియా ద్వీపమంతటా అది సత్యాసత్యాలను గురించి తెలుసుకునేందుకు దోహదపడిన మలుపు. దీని కారణంగానే ప్రజలకున్న అపోహలు, అపార్థాలు దూరమై, వారు శీఘ్రగతిన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించనారంభించారు. ఈ విషయంలో హజ్రత్ అమ్రూ బిన్ సల్మా (ర) గారి కథనం ఇలా ఉంది:

"మేము ఓ ఒయాసిస్సు దాపులో కాపురం ఉండేవాళ్ళం. మేముండే చోటు నుండి ప్రజలు బిడారాల రూపంలో వచ్చిపోతూ ఉండేవారు. మేము వారిని ఆపి, 'ప్రజల పరిస్థితి ఎలాగుంది?' అని అడిగితే, 'ఆ వ్యక్తి-ముహమ్మద్(స) - పరిస్థితి ఏమిటి? ఆయన ఎలాంటివాడు?' అని అడిగేవారు. జవాబుగా వారు, "ఆయన అల్లాహ్ ప్రవక్త అని అనుకుంటున్నాడు. ఆయనపై అల్లాహ్ దైవవాణిని అవతరింపజేస్తున్నాడట. అల్లాహ్ ఆ దైవావిష్కృతిలో ఇలా ఇలా అని చెబుతున్నాడట" అని చెప్పేవారు. వారు చెప్పిన దైవవాణి వాక్యాలను నేను కంఠస్థం చేసుకునేవాణ్ణి. అంటే అవి నా హృదయ ఫలకం మీద అతుక్కుపోయేవి అన్నమాట. అరబ్బులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడానికి మక్కా విజయం కోసం నిరీక్షిస్తూ, "అతణ్ణి, అతని జాతివారితో తలపడడానికి వదిలేద్దాం. అతనే గనక తన జాతివారిపై ఆధిక్యత సంపాదిస్తే అతను నిజమైన ప్రవక్త అని విశ్వసిద్దాం" అని అనుకుంటూ ఉండేవారు. కాబట్టి మక్కా విజయం సంఘటన జరిగిన తరువాత ప్రతి జాతి, తెగల వారు ఇస్లామ్ స్వీకరించి (మదీనా వైపునకు) వెళ్ళనారంభించారు. నా తండ్రిగారు కూడా నా జాతి వారితో కలసి ఇస్లామ్ ధర్మం స్వీకరించి మదీనాకు వెళ్ళారు. మహాప్రవక్త (స)ను కలిసి తిరిగి వచ్చి, "దైవసాక్షిగా చెబుతున్నాను! నేను మీ

https://teluguislam.net



వద్దకు ఓ సత్యప్రవక్త దగ్గరికెళ్ళి వస్తున్నాను. ఆయన (స), ఫలానా నమాజును ఫలానా వేళలో చేయమని ఆదేశించారు. నమాజు వేళ కాగానే మీలోని ఒకడు అజాన్ పలకాలి. ఎవరైతే ఖుర్ఆన్ బాగా పఠించ గలడో అతడు ఇమామత్ చేయాలి అని అన్నారు" అని చెప్పారు నా తండ్రిగారు.[1]

మక్కా విజయ సంఘటన పరిస్థితుల్ని మార్చివేయడంలోనూ, ఇస్లామ్ ధర్మానికి బలం చేకూర్చడంలోనూ, అరబ్బు పౌరుల వైఖరిని నిర్ణయించడం లోనూ ఇంకా ఇస్లామ్ ఎదుట వారిని మోకరిల్లజేయడంలోనూ, ఎంతో లోతైన, పటిష్ఠమైన ప్రభావాలు వేసింది. ఈ విషయాన్ని ఈ హదీసు ద్వారా మనం పసిగట్టవచ్చు. ఈ పరిస్థితే తబూక్ యుద్ధం తరువాత మరింత బలం పుంజుకుంది. ఈ రెండు సంవత్సరాల్లోనే, అంటే హిజ్రీ శకం 9 మరియు 10వ సంవత్సరంలోనే - ప్రతినిధి వర్గాలు గుంపులకు గుంపులుగా మదీనాకు రావడం మనం గమనించగలం. ప్రజలు తండోపతండాలుగా ఇస్లామ్ ధర్మంలో చేరిపోజొచ్చారు. మక్కాను జయించడానికి వెళ్ళినప్పుడు ముస్లిముల సైనిక బలం మొత్తం పది వేలే. ఆ సైనిక బలం గజ్వయె తబూక్‌కు బయలు దేరేటప్పటికి (అప్పటికీ ఒక సంవత్సరం కూడా పూర్తి కాలేదు) ముప్ఫై వేల సైన్యంతో ఉప్పొంగే సేనావాహినిలా మారిపోయింది. ఆ తరువాత 'హజ్జతుల్ విదా' (చివరి హజ్) సమయానికి ముస్లిముల సంఖ్య లక్షా ఇరవై నాల్గువేలు. మరో ఉల్లేఖనం ప్రకారం, లక్షా నలభైనాల్గు వేలకు పెరిగిపోయింది. వీరంతా దైవప్రవక్త (స) చుట్టూ చేరి 'లబ్బైక్' పలుకుతూ, దేవుని ఏకత్వాన్ని చాటే తక్బీర్ చెబుతూ, ఆయన స్తోత్రం చేస్తూ వెళ్ళగా కొండలు ప్రతిధ్వనించాయి. ప్రతి లోయ, ప్రతి కొండా, దేవుని ఏకత్వం చాటే నినాదాలతో మారు మ్రోగిపోయింది.

## ప్రతినిధి వర్గాలు

యుద్ధ చరిత్రలు రాసినవారు ఏ ప్రతినిధి వర్గాల గురించి అయితే రాశారో అవన్నీ కలిపి డెబ్బై వరకు ఉన్నాయి. వాటిని వివరంగా తెలియ జేయడంలో ఏలాంటి ప్రయోజనం లేదు. కాబట్టి మేము కేవలం, చారిత్రా

---

1. సహీహ్ బుఖారి-2/615, 616.

https://teluguislam.net



త్మకంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న కొన్ని ప్రతినిధి వర్గాలను గురించి చెప్పదలిచాము. సాధారణ తెగలకు చెందిన ప్రతినిధి వర్గాలు మక్కా విజయం తరువాత ప్రవక్త (స) గారి సన్నిధిలోకి రానారంభించినప్పటికీ, కొన్ని తెగల ప్రతినిధులు మాత్రం మక్కా విజయానికి ముందే మదీనాకు వచ్చారన్న విషయాన్ని పాఠకులు ఇక్కడ గమనించాల్సి ఉంటుంది. మేము ఇక్కడ వారిని గురించి కూడా చెప్పదలిచాము.

## 1. అబ్దుల్ ఖైస్ ప్రతినిధి వర్గం

ఈ తెగవారి ప్రతినిధి వర్గం రెండుమార్లు మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. మొదటిసారి హిజ్రీ శకం 5లోనో, అంతకు పూర్వమో, రెండోసారి ఆమ్ముల్ ఉఫూద్ (ప్రతినిధులు వచ్చిన సంవత్సరం) హిజ్రీ శకం 9లో. మొదటిసారి వచ్చిన ప్రతినిధి వర్గం, మొదటిసారి రావడానికి మున్ఖిద్ బిన్ హబ్బాన్ కారకుడు. అతను వ్యాపార సామగ్రిని తీసుకొని మదీనాకు వచ్చిపోయే వాడు. దైవప్రవక్త (స) హిజ్రత్ చేసి వచ్చిన తరువాత మొదటిసారిగా మదీనాకు వచ్చినప్పుడు అతనికి ఇస్లామ్ ధర్మం గురించి తెలిసింది. అతడు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమైపోయాడు. దైవప్రవక్త (స) ఇచ్చిన ఓ లేఖను తీసుకొని తన తెగ దగ్గరకు వెళ్ళగా వారు కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. వారికే చెందిన పదముగ్గురు లేదా పదునల్గురితో కూడిన ఓ ప్రతినిధి వర్గం నిషిద్ధ మాసాలలో వచ్చి మహాప్రవక్త (స)ను కలిసింది. ఈసారి ఈ ప్రతినిధి వర్గం విశ్వాసం గురించి, పానీయాల గురించి అడిగి తెలుసుకుంది. దాని నాయకుడు అల్ అష్జుల్ అస్రీ.[2] అతనితో మహాప్రవక్త (స), "అల్లాహ్‌కు ఇష్టమైన రెండు సుగుణాలున్నాయి నీలో. అవి: 1. దూరదృష్టి, 2. సహనం" అని చెప్పడం జరిగింది.

రెండోసారి ఆ తెగకు చెందిన ప్రతినిధి వర్గం, పైన చెప్పినట్లు ప్రతినిధి వర్గాలు వచ్చిన సంవత్సరం వచ్చింది. అప్పుడు వారి సంఖ్య మొత్తం నలభై మంది. వారిలో అలా బిన్ జారూద్ అనే క్రైస్తవుడు కూడా ఉన్నాడు. అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించాడు.[3]

---

2. మర్ఆతుల్ మఫాతీహ్-1/71
3. షరహ్ సహీహ్ ముస్లిమ్-నూవీ: 1/33; ఫత్‌హుల్ బారి - 8/85,86

https://teluguislam.net



## 2. దౌస్ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం హిజ్రీ శకం 7 ప్రారంభ కాలంలోనే మదీనాకు వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) 'ఖైబర్'లో ఉన్నారు. ఈ తెగ సర్దారు అయిన 'హజ్రత్ తుఫైల్ బిన్ అమ్రూ దౌసీ' (ర), మహాప్రవక్త (స) మక్కాలో ఉన్నప్పుడే ఇస్లామ్ స్వీకరించారన్న విషయం మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. ఆ తరువాత ఆయన తన జాతివారి వద్దకు తిరిగి వెళ్ళి ఇస్లామ్ ధర్మప్రచారంలో నిమగ్నమైపోయారు. కాని ఆయన జాతివారు ఇస్లామ్ ధర్మం స్వీకరించకపోయినప్పుడు విసిగిపోయి చివరికి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి వారిని శపించమని కోరారు. కాని కారుణ్యమూర్తి (స), "ఓ అల్లాహ్! దౌస్ వారికి సన్మార్గాన్ని చూయించు" అని ప్రార్థించారు. తరువాత ఆ తెగ వారంతా ఇస్లామ్‌ను స్వీకరించి ముస్లిములైపోయారు. హజ్రత్ తుఫైల్ తన జాతికి చెందిన డెబ్భై లేదా ఎనభై కుటుంబాల వారిని వెంట బెట్టుకొని హి.శ.7 ప్రారంభ కాలంలో హిజ్రత్ చేసి మదీనాకు వచ్చేశారు. అప్పుడు మహాప్రవక్త (స) ఖైబర్‌కు వెళ్ళి ఉన్నారు. ఆ తరువాత తుఫైల్ ముందుకు నడిచి దైవప్రవక్త (స) ను వచ్చి కలిశారు.

## 3. ఫర్వాహ్ బిన్ అమ్రూ జిజామీ పంపిన వార్తాహరుడు

హజ్రత్ ఫర్వాహ్, రోమను సైన్యంలోని ఓ అరబ్బు కమాండరు. ఆయన్ను రోమనులు తమ సరిహద్దుకు ఆనుకొని ఉన్న ప్రాంతాలకు గవర్నరుగా నియమించి ఉన్నారప్పుడు. ఆయన మూతా యుద్ధం (హి.శ. 8)లో ముస్లిముల ధైర్యసాహసాలు, యుద్ధతంత్రం మరియు స్థయిర్యాన్ని చూసి ఇస్లామ్ స్వీకరించారు. ఓ వార్తాహరుని ద్వారా తాను ముస్లిమునై పోయాననే విషయాన్ని మహాప్రవక్త (స)కు ఎరుకపర్చడం జరిగింది. కానుకగా ఓ తెల్లని కంచర గాడిదను కూడా పంపించారు. రోమనులకు ఆయన ఇస్లామ్ ధర్మం స్వీకరించిన విషయం తెలియగా, మొదట ఆయన్ను బంధించి చెరసాలలో పడవేశారు. ఆ పిదప ఆయనకు, ఆ ధర్మాన్నయినా వదిలి ముర్తద్ కమ్మని లేదా మరణానికి సిద్ధం అయినా కమ్మని చెప్పారు. ఆయన ధర్మభ్రష్టత్వానికి బదులు మరణాన్నే స్వీకరించారు. పాలస్తీనాలో అఫ్రా పేరుగల ఒయాసిస్సు వద్ద ఆయన్ను ఉరివేసి చంపడం జరిగింది.[4]

https://teluguislam.net



## 4. సదాల ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం మహాప్రవక్త (స), హి.శ. 8లో 'జీరానా' నుండి తిరిగి వచ్చిన తరువాత హాజరైన ప్రతినిధి వర్గం, ఈ ప్రతినిధి వర్గం రావడానికి కారణం, మహాప్రవక్త (స) నాల్గు వందల ముస్లిములతో కూడిన ఓ పటాలాన్ని సిద్ధం చేసి, యమన్‌లో 'సదాల' తెగ నివసిస్తున్న ప్రాంతానికి వెళ్ళిరమ్మని పంపించడమే. ఈ పటాలం ఇంకా 'వాదియె ఖనాత్'లో గుడారాలు వేసిందో లేదో, 'హజ్రత్ జయాద్ బిన్ హారిస్ సదాయీ'కి ఈ విషయం తెలియనే తెలిసింది. ఆయన ఉరుకులు పరుగుల మీద దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై, "నా వెనుక ఉన్నవారి (అంటే నా జాతివారి) తరపున మీ దగ్గరకు వారి ప్రతినిధిగా హాజరయ్యాను. తమరు వాదియె ఖనాత్ నుండే ఆ పటాలాన్ని వెనక్కు పిలిపించుకోండి" అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) ఆ సైనిక పటాలాన్ని అక్కడి నుండే వెనక్కు రప్పించుకోవడం జరిగింది. ఆ తరువాత జయ్యాద్ తన జాతివారి వద్దకు వెళ్ళి, మీరు మహాప్రవక్త (స) గారి దగ్గరకు వెళ్ళిరండని ప్రోత్సహించారు. ఆయన ఈ ప్రోత్సాహంపై పదిహేను మంది 'సదాల' తెగవారు దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. ఇస్లామ్‌ను స్వీకరించి బైత్ చేశారు. తిరిగి తమ జాతివారి వద్దకు వెళ్ళి ఇస్లామ్ ధర్మప్రచారం ప్రారంభించారు. ఇలా వారిలో ఇస్లామ్ వ్యాపించింది. 'హజ్జతుల్ విదా' సందర్భంగా ఆ తెగకు చెందిన నూరు మంది మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఆయన్ను దర్శించుకున్నారు.

## 5. కఅబ్ బిన్ జుహైర్ బిన్ అబీ సల్మా రాక

ఈయన ఓ కవి కుటుంబానికి చెందినవాడు. స్వయంగా అరేబియా లోని గొప్ప కవుల్లో ఒకడు. ఇతను దైవ తిరస్కారి. ఎల్లప్పుడూ దైవప్రవక్త(స)ను తన కవనంలో తిట్టేవాడు. ఇమామె మాలిక్ (రహ్మాలై) గారి కథనం ప్రకారం, అతను మక్కా విజయమప్పుడు ప్రకటించిన నేరగాళ్ళ పట్టికలో ఒకడు. ఆ నేరగాళ్ళను గురించి మహాప్రవక్త (స), "వారు కాబా పరదాను పట్టుకొని ఉన్నా సరే" సంహరించాలనే ఆదేశం ఇచ్చి ఉన్నారు. కాని అతను పారి పోవడంలో కృతకృత్యుడయ్యాడు. ఇటు మహాప్రవక్త (స) తాయెఫ్ పోరాటం

4. జాదుల్ మఆద్-3/45.

https://teluguislam.net



నుండి తిరిగివచ్చిన తరువాత కఅబ్ సోదరుడు 'బజీర్ బిన్ జుహీర్' అతనికి ఓ ఉత్తరం రాస్తూ, "దైవప్రవక్త (స), తనను కవనంలో తిట్టి బాధించే వారిలో అనేకుల్ని చంపించారని, మిగిలిన కవులంతా తమకు తోచిన దిక్కుకు పారిపోయారని, నీకే గనక నీ ప్రాణం మీద తీపి ఉంటే దైవప్రవక్త (స) వద్దకు సత్వరమే వచ్చేయి, తౌబా చేసి ఆయన వద్దకు వచ్చేవారిని ఆయన సంహరించరు. ఇది నీకు సమ్మతం కాకపోతే నీకెక్కడ రక్షణ లభిస్తుందో అక్కడికి వెళ్ళిపో" అని చెప్పాడు. ఆ ఇరువురు సోదరుల్లో ఉత్తరప్రత్యుత్తరాలు కొంత కాలంపాటు జరిగాయి. దాని ఫలితంగా 'కఅబ్ బిన్ జుహీర్'కు ప్రపంచమే ఇరుకైపోయినట్లు అగుపించింది. తన ప్రాణాలు గాలిలో కలిసి పోతాయనే బెంగ పట్టుకుంది. చివరికి అతను మదీనాకు వచ్చి 'జుహైనా' తెగకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో తలదాచుకున్నాడు. అతని వెంటే వెళ్ళి ఫజ్ర్ నమాజు చేశాడు. నమాజు అయిన తరువాత 'జుహైనీ' అతనికి సైగ చేయగా అతను మహాప్రవక్త (స) వద్దకు వెళ్ళి కూర్చుని తన చేతిని ఆయన (స) చేతిలో పెట్టాడు. మహాప్రవక్త (స) అతణ్ణి ఇప్పటి వరకు చూడలేదు. అతను, "దైవప్రవక్తా! కఅబ్ బిన్ జుహీర్ తౌబా చేసి ముస్లిము అయిపోయాడు. మీ తరఫున రక్షణ కోరుతున్నాడు. నేను అతణ్ణి మీ సన్నిధికి పిలుచుకు రానా? మీరు ఈ విషయాలను స్వీకరిస్తారా?" అని అడిగాడు. మహాప్రవక్త (స), 'అవును' అని అనగానే అతడు, "నేనే కఅబ్ బిన్ జుహీర్ని" అని అనడంతోనే ఓ అన్సారీ సహాబీ అతనిపై విరుచుకుపడి అతని తలను నరకడానికి మహాప్రవక్త (స)గారి అనుమతిని కోరారు.

"వదిలేయ్! ఈ వ్యక్తి పశ్చాత్తాప హృదయంతో తౌబా చేసి, వెనుకటి విషయాలను వదిలేసి వచ్చినవాడు" అని వారించారు మహాప్రవక్త (స).

ఈ సందర్భంగా కవి కావున 'కఅబ్' దైవప్రవక్త(స)ను శ్లాఘిస్తూ తన ప్రఖ్యాత 'ఖసీదా' (శ్లాఘనీయమైన పదబంధం)ను వినిపించారు.

ఆ తరువాత ఆయన (ర) ముహాజిర్లను కూడా మెచ్చుకుంటూ, తాను దైవప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు మేలైన విషయం తప్ప మరే మాట మాట్లాడలేదని కవనం చెప్పారు. అయితే అన్సారులకు చెందిన ఓ

https://teluguislam.net



వ్యక్తి అతని మెడ నరకడానికి ఉద్యమించాడని చెబుతూ ఆ మెచ్చుకోలులోనే అతనిపై నింద కూడా వేస్తూ 'ఖసీదా' చదివారు.

కఅబ్ (ర) ఇస్లామ్ ధర్మం స్వీకరించి ముస్లిముగా మారిన తరువాత ఆయనలో పరివర్తన వచ్చింది. అప్పుడు ఆయన అన్సారులను మెచ్చుకుంటూ మరో ఖసీదాను చదివి ఇదివరకు అన్సారుల విషయంలో తప్పు దొరలి పోయిందని పశ్చాత్తాపపడ్డారు.

## 6. 'అజ్రా' వారి ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం సఫర్ మాసం, హి.శ. 9లో మదీనాకు వచ్చింది. ఇది పన్నెండు మందితో కూడిన ప్రతినిధి వర్గం. ఇందులో హమ్జా బిన్ నోమాన్ కూడా ఉన్నారు. 'మీరెవరూ?' అని ఆ ప్రతినిధి వర్గాన్ని అడిగినప్పుడు, వారి నాయకుడు లేచి, "మేము బనూ అజ్రా తెగవాళ్ళం. ఖుసైకు మారుసోదరులం; 'ఖుజాఅ' మరియు 'బనూ బక్ర్' తెగలను మక్కా నుండి వెళ్ళగొట్టినప్పుడు మేము ఖుసైను బలపరచినవాళ్ళం. (ఇక్కడ) మా బంధువులు ఉన్నారు" అని చెప్పాడు. ఇది విన్న దైవప్రవక్త (స) వారికి స్వాగతం పలికి సిరియా దేశాన్ని జయిస్తారనే శుభవార్తను అందజేశారు. అదేకాకుండా జ్యోతిష్యం చెప్పే స్త్రీలను ప్రశ్న అడగకూడదని, వారు (బహుదైవారాధనలో ఉంటూ) జిబహ్ చేసుకొని తినే జంతువుల మాంసాన్ని తినవద్దని వారించారు. ఈ ప్రతనిధి వర్గం ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి, కొన్ని రోజులు మదీనాలో మకాం వేసి తిరిగి వెళ్ళిపోయింది.

## 7. బలీ ప్రతినిధి వర్గం

ఇది రబీవుల్ అవ్వల్, హి.శ. 9లో మదీనాకు వచ్చింది. ఇస్లామ్ స్వీకరించిన తరువాత మూడు రోజుల వరకు మదీనాలో మకాము వేసింది. ఈ మూడు రోజులలో ఆ ప్రతినిధి వర్గానికి నాయకుడైన అబుజ్జుబైబ్ దైవప్రవక్త (స)ను, "అతిథి మర్యాదలు చేయడం పుణ్యకార్యమేనా?" అని అడగగా,

"అవును, అది పుణ్యకార్యమే. దానికి ప్రతిఫలం లభిస్తుంది. ఏ పేదవాని ఎడలా, ధనవంతుని ఎడలా సత్ప్రవర్తనతో మెలిగినా అది సదఖాయే" అని సెలవిచ్చారు మహాప్రవక్త (స).

https://teluguislam.net



"అతిథి మర్యాదల గడువు ఎన్ని రోజులు?" అడిగాడు ఆ వ్యక్తి.

"మూడు రోజుల వరకు అతిథి మర్యాదలు చేయవచ్చు."

"జాడలేకుండా పోయిన వ్యక్తికి సంబంధించిన గొర్రె లేదా మేక దొరికితే దాన్ని ఏం చేయాలి?" అడిగాడు అబుజ్జుబైబ్.

"అది నీదే లేదా నీ సోదరునిది, తోడేలుది" అన్నారు మహాప్రవక్త (స). ఆ పిదప అతను ఒంటె గురించి కూడా అడగగా, "దీనితో నీకు సంబంధం ఏమిటి? దాని యజమానికి అది దొరికే అంతవరకు దాన్ని వదిలేయ్" అన్నారు మహాప్రవక్త (స).

## 8. సఖీఫ్ ప్రతినిధి వర్గం

రమజాన్ నెల (హి.శ. 9)లో తబూక్ నుండి తిరిగివచ్చిన తరువాత దైవప్రవక్త(స) గారి సన్నిధికి హాజరైన ప్రతినిధి వర్గమిది.

ఈ తెగవారిలో ఇస్లామ్ ధర్మం వ్యాపించడానికి కారణం, దైవప్రవక్త (స) జీఖాదా మాసం (హి.శ. 8)లో తాయెఫ్ పోరాటం నుండి మదీనాకు తిరిగిరావడానికి పూర్వమే ఆ తెగ సర్దారు అయిన ఉర్వా బిన్ మస్ఊద్ (ర) ఆయన సన్నిధికి హాజరై ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి తన తెగవారి వద్దకు వెళ్ళి ఇస్లామ్ ధర్మం వైపునకు వారిని ఆహ్వానించడమే. ఆయన తన జాతికి తలమానికం అయినందున, ఆయన మాటలను శిరసావహించడమే కాకుండా, ఆ తెగవారు ఆయన్ను తమ కన్నకూతుళ్ళు, భార్యల కంటే ప్రేమగా చూసుకునేవారు. ప్రజలు తమ ఆహ్వానాన్ని శిరసావహిస్తారనే ఉద్దేశ్యంతో వారి ముందు ఇస్లామ్ ధర్మాన్ని గురించి విడమర్చి చెప్పారు. ఆయన అనుకున్న దానికి పూర్తిగా భిన్నమైన రీతిలో ఆయన తెగవారు అన్ని వైపుల నుండి ఆయనపై బాణాలు వదిలి చంపివేశారు. ఆయన మరణానంతరం కొన్ని నెలల వరకు అలానే ఉండిపోగా, ఆ తరువాత చుట్టుపట్ల ప్రాంతం వారంతా ముస్లిములైపోయినందున, వారిని ఎదిరించడం ఇక సాధ్యం కాదనే తలంపుతో పరస్పరం చర్చించుకొని ఓ మనిషిని మహాప్రవక్త (స) వద్దకు పంపించాలనే నిర్ణయానికి వచ్చారు. దాని కోసం వారు 'అబ్దెయా లైల్ బిన్ అమ్రూ' తో మాట్లాడారు. కాని అతను వెళ్ళడానికి నిరాకరించాడు. ఎందుకంటే, ఇదివరకు

https://teluguislam.net



ఉర్వా బిన్ మస్ఊద్ (ర) ఎడల వారు ప్రవర్తించిన తీరు అతన్ని భయ పెట్టడమే. అందుకని అతడు వారితో, "నా వెంట మరికొందరిని తోడుగా పంపించనంత వరకు నేను ఆ కార్యాన్ని చేబట్టలేను" అని ఖచ్చితంగా చెప్పేశాడు. వారు అతని ఈ డిమాండును స్వీకరించి అతని వెంట వారి మిత్రపక్షాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను, బనీ మాలిక్‌కు చెందిన మరో ముగ్గురిని పంపించారు. ఇలా ఈ ఆరుగురు వ్యక్తుల ఓ ప్రతినిధి వర్గం తయారైంది. ఈ ప్రతినిధి వర్గంలో 'ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్ సఖఫీ' కూడా ఉన్నారు. ఈయన వారందరిలో పిన్నవయస్కుడు.

వీరంతా కలసి ప్రవక్త (స) సన్నిధికి చేరగా ఆయన (స) మస్జిద్ ఓ మూలన, వారు ఖుర్ఆన్ పారాయణం వినడానికి, ప్రజలు నమాజు చేస్తూ ఉండడం చూడడానికి గాను విడిది ఏర్పాటు చేయించారు. ఆ తరువాత వీరు మహాప్రవక్త (స) వద్దకు వచ్చిపోవడం, ఆయన (స) వారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించడం జరుగుతూ ఉండేది. చివరికి ఆ ప్రతినిధి వర్గం నాయకుడు దైవప్రవక్త(స)ను, తమరు, "వ్యభిచారం, మత్తుపానీయాల సేవనం మరియు వడ్డీ వ్యాపారం కోసం అనుమతి ఇస్తూ ఓ ఒడంబడిక పత్రాన్ని రాసి ఇవ్వండని, అలాగే ఆ ఒప్పంద పత్రంలో, వారి ఆరాధ్య దైవం అయిన 'లాత్' దేవుణ్ణి యథాస్థితిలో ఉంచమనీ, నమాజు చేయకుండా ఉండే అనుమతినివ్వమనీ, వారి విగ్రహాలను వారి చేతుల మీదుగా ధ్వంసం చేయించవద్దనే" అనుమతినీ కోరాడు. కాని మహాప్రవక్త (స) ఆ షరతుల్లో ఏ షరతునూ ఒప్పుకోలేదు. ప్రవక్త (స) గారి ఈ వైఖరి చూసిన వారు పరస్పరం చర్చించుకున్నారు. కాని ఆయన (స)గారి ఆదేశాలను శిరసావహించడం తప్ప వారికి మార్గాంతరం అగుపడలేదు. చివరికి వారు విధిలేక దైవప్రవక్త (స)కు లొంగిపోయి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించకతప్పలేదు. అయితే, లాత్ దేవుని విగ్రహాన్ని పడగొట్టే పని మరెవరికైనా అప్పగించమని, సఖీఫ్ తెగవారు స్వయంగా తమ చేతుల మీదుగా దాన్ని పడగొట్టకుండా చూడమని మరో షరతు పెట్టారు. మహాప్రవక్త (స) ఆ షరతును మంజూరు చేస్తూ ఓ పత్రం రాసి ఇచ్చారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్ సఖఫీని ఆ బృందానికి అమీరుగా (అధ్యక్షునిగా) చేసి పంపించారు. ఇలా ఆయన్ను అమీర్‌గా చేయడానికి కారణం లేకపోలేదు. ఆయన ఇస్లామ్ ధర్మాన్ని అర్థం చేసు

https://teluguislam.net



కోవడంలో, ధర్మం మరియు ఖుర్‌ఆన్ జ్ఞానాన్ని ఆర్జించడంలో అందరికంటే ముందుండే వ్యక్తి. ఆ ప్రతినిధి వర్గానికి చెందిన సభ్యులంతా కలసి ప్రతి రోజు ఉదయాన్నే దైవప్రవక్త (స) గారి సన్నిధిలో హాజరవుతూ ఉండేవారు. కాని హజ్రత్ ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్ (ర)ను తన గుడారంలోనే వదిలిపెట్టి వెళ్ళేవారు. ఆ ప్రతినిధి వర్గం తిరిగివచ్చి మధ్యాహ్నం పూట మేనువాల్చగానే హజ్రత్ ఉస్మాన్(ర) దైవప్రవక్త (స) గారి వద్దకు వెళ్ళి ఖుర్‌ఆన్‌ను పఠించేవారు. ధర్మావగాహన చేసుకోవడానికి ప్రశ్నలు కూడా వేసేవారు. దైవప్రవక్త (స) పడుకున్నప్పుడు ఆయన దీని కోసం హజ్రత్ అబూ బక్ర్(ర)గారి వద్దకు వెళ్ళేవారు. (హజ్రత్ ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్(ర)గారి గవర్నరుగిరి ఎంతో శుభాన్ని అందించింది. ఆ తరువాత దైవప్రవక్త (స) గారి మరణానంతరం అబూ బక్ర్ సిద్దీఖ్(ర)గారి ఖిలాఫత్‌లో ఇర్తెదాద్ (ధర్మభ్రష్టత్వం) గాలి బాగా వీచినప్పుడు సఖీఫ్ తెగవారు కూడా ఇస్లామ్ ధర్మాన్ని వీడిపోవాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ (ర) వారిని వారిస్తూ, "సఖీఫ్ ప్రజలారా! మీరు అందరికంటే వెనుకగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినవారు. కాబట్టి ఇప్పుడు అందరికంటే ముందే ధర్మభ్రష్టులు కాకండి" అని హితవు పలికారు. ఆయన మాటలు విని ఆ తెగవారు ఇస్లామ్ ధర్మంపైన్నే స్థిరంగా ఉండి పోయారు.)

మొత్తానికి ఆ ప్రతినిధి వర్గం తిరిగివచ్చి తమ తెగవారితో అసలు విషయం చెప్పకుండా దాచి ఉంచారు. దానికి బదులు తెగ వారిలో యుద్ధం గురించి లేనిపోని అపోహలను సృష్టించారు. విచారాన్ని, బాధను ప్రకటిస్తూ, "దైవప్రవక్త (స) మమ్మల్ని ఇస్లామ్ ధర్మం స్వీకరించమని, వ్యభిచారాన్ని, మద్యపాన సేవనాన్ని, వడ్డీ వ్యాపారాన్ని విడువమని చెప్పారు. లేదంటే పెద్ద యుద్ధమే జరిగేటట్లుంది" అని చెప్పారు. ఇది విన్న సఖీఫ్ తెగ వారిపై అజ్ఞాన కాల పౌరుషపు ఆలోచనలే అలుముకున్నాయి. రెండు మూడు రోజుల వరకు యుద్ధానికి సంబంధించిన విషయాలనే చర్చించుకున్నారు. కాని అల్లాహ్ వారి హృదయాల్లో ముస్లిముల దడుపును పుట్టించాడు. వారంతా కలసి ఆ ప్రతినిధి వర్గంతో, తిరిగి మహాప్రవక్త (స) వద్దకు వెళ్ళి ఆయన షరతులు మాకు సమ్మతమే అని చెప్పి విన్నవించుకోండని చెప్పారు. అప్పుడుగాని ఈ ప్రతినిధి వర్గం అసలు విషయం బయటపెట్టలేదు. ఇదివరకే మేము ఈ

https://teluguislam.net



షరతుల్ని ఒప్పుకొని వచ్చాం అని చెప్పగా, సఖీఫ్ తెగ అంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిముగా మారిపోయింది.

ఇటు మహాప్రవక్త (స) లాత్ విగ్రహాన్ని పడగొట్టేందుకు హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)గారి నేతృత్వంలో బహుకొద్ది మందిగల ఓ సైనిక పటాలాన్ని పంపించారు. హజ్రత్ ముగైరా బిన్ షైబా (ర) నిలబడి గద పైకెత్తి తన మిత్రులతో, చూడండి నేనో తమాషా చేయబోతున్నాను. మీరు తాయెఫ్ ప్రజలను చూసి నవ్వేటట్లు చేస్తాను అంటూ 'లాత్' విగ్రహంపై ఒక్క వ్రేటు వేసి తానే క్రిందపడి తన్నుకోనారంభించారు. ఈ నాటకం చూసి సఖీఫ్ తెగవారు గగ్గోలుపెడుతూ అల్లాహ్ ముగైరాను నాశనం చేయుగాక. చూశారా! ఈ దేవత అతణ్ణి చంపేసింది అని అనుకోజొచ్చారు. వెంటనే హజ్రత్ ముగైరా (ర) ఎగిరి లేచి నిలబడ్డారు.

"చూశారా! అల్లాహ్ మిమ్మల్ని నాశనం చేయుగాక! ఇది కేవలం మట్టితో రాళ్ళతో చేసిన ఓ విగ్రహం మాత్రమే" అంటూ ఆ విగ్రహాలయ ద్వారాన్ని బాది విరగొట్టారు. అది విరిగి క్రిందపడిపోగానే ఎత్తయిన ఓ గోడపై నిలబడి ఆ విగ్రహాన్ని పడగొట్టనారంభించారు. ఆయనతో సహా మరికొందరు సహాబా (ర)లు గోడపైకెక్కి ఆ విగ్రహాన్ని నేలమట్టం చేయనారంభించారు. చివరికి నుజ్జునుజ్జయి అది పడిపోయింది. ఆ తరువాత వారు దాని పునాదుల్ని కూడా త్రవ్వేశారు. ఆ విగ్రహంపై ఉన్న ఆభరణాలను, వస్త్రాలను ఒలిచేశారు. ఇది చూసిన సఖీఫ్ వారికి నోటమాట పెగల్లేదు. హజ్రత్ ఖాలిద్ (ర) ఆ ఆభరణాలను, వస్త్రాలను తీసుకొని తమ దళంతో సహా దైవప్రవక్త(స) వద్దకు తిరిగి రాగా ఆయన (స) అదే రోజు ఆ వస్తువులను వారికి పంచేశారు. దైవప్రవక్త (స)కు అల్లాహ్ చేకూర్చిన సహాయానికీ, ధర్మానికి గలిగిన గౌరవోన్నతులకూ ఆయన్ను వారంతా కలసి స్తుతించారు.[5]

## 9. యమన్ రాజుల లేఖ

తబూక్ నుండి తిరిగి వచ్చిన తరువాత 'హిమ్యైర్ రాజులు' అంటే, హారిస్ బిన్ అబ్దె కిలాల్, నయీమ్ బిన్ అబ్దె కిలాల్, రయీన్, హమ్దాన్ మరియు ముఆఫిర్ పాలకుడు నోమాన్ బిన్ ఖీల్ పంపిన ఓ లేఖ దైవప్రవక్త

5. జాదుల్ ముఆద్-3/26,27, 28; ఇబ్నె హిషామ్-2/537-542.

https://teluguislam.net



(స)కు అందింది. ఆ లేఖను తెచ్చినవాడు మాలిక్ బిన్ ముర్రా రిహాదీ. ఈ రాజులు తాము ఇస్లామ్ స్వీకరించామని, షిర్క్ (బహుదైవారాధన) మరియు బహుదైవారాధకులతో తెగతెంపులు చేసుకున్నామనే విషయం ఆ లేఖ ద్వారా తెలియజేయడం జరిగింది. మహాప్రవక్త (స) వారి వద్దకు సమాధాన పత్రంగా ఓ లేఖ రాస్తూ, విశ్వాసుల హక్కులు, వారి బాధ్యతలు ఏమిటో విడమర్చి చెప్పారు. ఆయన ఈ లేఖలో ముఆహిదీన్ (ఒప్పందం చేసుకున్న వారు) కోసం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) బాధ్యులుగా ఉన్నారంటూ ధైర్యం చెప్పారు. అయితే ఆ ముఆహిదీన్‌లు జిజియా మాత్రం చెల్లించవలసి ఉంటుందని ఆదేశించారు. అదే కాకుండా మహాప్రవక్త (స) కొందరు సహాబా(ర)లను యమన్‌కు పంపిస్తూ దాని నాయకునిగా హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (ర)ను నియమించారు.

## 10. హమ్దాన్ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (స) వద్దకు ఆయన తబూక్ నుండి తిరిగి వచ్చిన తరువాత హిజ్రీ శకం 9లో హాజరైన ప్రతినిధి వర్గం. మహాప్రవక్త (స) వారికి ఓ రక్షణ పత్రాన్ని రాసి ఇస్తూ వారు అడిగింది ఇచ్చి పంపించారు. మాలిక్ బిన్ నమ్త్ ను అమీరుగా నియమించి, ఆయన జాతికి చెందిన వారెవరైతే ముస్లిములయ్యారో వారికి గవర్నరుగా కూడా చేసి పంపారు. మిగిలిన వారి వద్దకు ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించడానికిగాను హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)ను పంపించడం జరిగింది. ఆరు మాసాల వరకు ఆయన అక్కడుండి వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు. ఆ తరువాత మహాప్రవక్త (స), హజ్రత్ అలీ (ర) బిన్ అబీ తాలిబ్‌ను పంపిస్తూ ఖాలిద్ బిన్ వలీద్‌ను వెనక్కు పంపించమని ఆదేశించారు. హజ్రత్ అలీ (ర) హమ్దాన్ తెగ వారి వద్దకు వెళ్ళి దైవప్రవక్త (స) రాసి ఇచ్చిన లేఖను చదివి వినిపించారు. వారిని ఇస్లామ్ వైపునకు రమ్మని ఆహ్వానించగా వారంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు. వీరంతా ఇస్లామ్ ధర్మం స్వీకరించారనే శుభవార్తను హజ్రత్ అలీ (ర) దైవప్రవక్త (స)కు అందజేయగా దైవప్రవక్త (స) వెంటనే

https://teluguislam.net



సజ్దా చేశారు. ఆ తరువాత తలపైకెత్తి, "హమ్దాన్ వారిపై శాంతి కురియుగాక, హమ్దాన్ ప్రజలపై శాంతి కురియుగాక" అని ప్రార్థించారు.

## 11. బనీ ఫజారా ప్రతినిధి వర్గం

హిజ్రీ శకం 9లో, దైవప్రవక్త (స) తబూక్ నుండి తిరిగివచ్చిన తరువాత హాజరైన ప్రతినిధి వర్గం ఇది. ఈ ప్రతినిధుల సంఖ్య పది మందికి పైన్నే. వీరంతా ఇదివరకే ఇస్లామ్‌ను స్వీకరించినవారు. తమ ప్రాంతంలో కరవు కాటకాలు తాండవిస్తున్నాయని విన్నవించుకున్నారు. మహాప్రవక్త (స) మెంబరు పైకి ఎక్కి రెండు చేతులెత్తి వర్షం కోసం అర్థించారు అల్లాహ్‌ను. ఆయన (స) చేసిన ప్రార్థన ఇలా ఉంది:

"ఓ ప్రభూ! నీ దేశ ప్రజలు, నీ పశుసంపద దప్పికను తీర్చు. నీ కారుణ్యాన్ని విస్తరింపజెయ్యి. నీ మృత నగరాన్ని సజీవమొనర్చు. ఓ అల్లాహ్! మా మొరలను ఆలకించేటటువంటి వర్షాన్ని కురిపించు. మాకు సుఖాన్నిచ్చేదీ, ఉల్లాసాన్ని కలిగించేదీ, విస్తారమైనదీ, త్వరగా కురిసేదీ, ఆలస్యం కానటు వంటిదీ అయిన వర్షాన్ని కురిపించు. మాకు లాభదాయకమైనదీ, నష్టదాయకం కానటువంటిదీ అయిన వర్షం. ఓ ప్రభూ! కారుణ్యప్రదాయిని అయినదీ, శిక్షకు లోను చేసేది కానటువంటిదీ, విధ్వంసకారి కానిదీ, ముంచి వేయనటు వంటిదీ అయిన వర్షం కురిపించు. ఓ దేవా! వర్షం ద్వారా మమ్మల్ని తృప్తిపరచు, శత్రువులకు వ్యతిరేకంగా మాకు సహాయం చెయ్యి."[6]

## 12. నజ్రాన్ ప్రతినిధి వర్గం

నజ్రాన్ మక్కా నుండి యమన్ వైపు ఏడు మజిలీల దూరంలో ఉన్న ఓ పెద్ద ప్రాంతం. ఈ ప్రాంతంలో 73 బస్తీలు ఉండేవి. వేగంగా ప్రయాణించ గల అశ్వారూఢుడు ఒక్క రోజులో ఈ ప్రాంతాన్నంతా చుట్టి రాగలడు.[7] ఈ ప్రాంతంలో ఒక లక్ష మంది యోధులుండేవారు. వారందరూ క్రైస్తవ మతావలంబీకులే.

నజ్రాన్ ప్రతినిధి వర్గం హిజ్రీ శకం 9లో హాజరైంది. వీరందరూ కలసి మొత్తం అరవై మంది. ఇరవై నలుగురు పలుకుబడి కలిగిన గౌరవనీయులు.

---

6. జాదుల్ ముఆద్-2/48. 7. ఫత్‌హుల్ బారి-8/94.

https://teluguislam.net



వీరిలో ముగ్గురు నజ్రాన్ వారికి నాయకులు కూడా. అందులో ఒకడు 'ఆఖిబ్' (పాలనాధికారాలు గలవాడు). ఇతని పేరు అబ్దుల్ మసీహ్. రెండోవాడు 'సయ్యద్' (రాజకీయ విషయాలను చూసేవాడు). ఇతని పేరు అయిహమ్ లేదా షర్జీత్. ఇక మూడవ వాడు 'అస్ఖఫ్' (క్రైస్తవ మతగురువు (ఫాదరు) అంటే ధార్మిక విషయాలకు పెద్ద, ఆధ్యాత్మిక గురువు). ఇతని పేరు అబూ హారిసా బిన్ అల్కమా.

ఈ ప్రతినిధి వర్గం మదీనా నగరానికి చేరి దైవప్రవక్త (స)ను కలసి కొన్ని ప్రశ్నలు అడిగింది. అలాగే మహాప్రవక్త (స) కూడా వారిని కొన్ని ప్రశ్నలు అడిగారు. తరువాత ఆయన(స) వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను చదివి వినిపించారు. కాని వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు. ఆ ప్రతినిధి వర్గం వారు, ""ఏసుక్రీస్తును గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగారు. మహాప్రవక్త (స) ఆ ప్రశ్నకు జవాబు అప్పుడే చెప్పకుండా ఆ రోజు పూర్తిగా మౌనంగా ఉండి పోయారు. చివరికి ఆయనపై ఈ ఖుర్‌ఆన్ వాక్యాలు అవతరించాయి.

إِنَّ مَثَلَ عِيسَىٰ عِندَ اللَّهِ كَمَثَلِ آدَمَ ۖ خَلَقَهُ مِن تُرَابٍ ثُمَّ قَالَ لَهُ كُن فَيَكُونُ ۝ الْحَقُّ مِن رَّبِّكَ فَلَا تَكُن مِّنَ الْمُمْتَرِينَ ۝ فَمَنْ حَاجَّكَ فِيهِ مِن بَعْدِ مَا جَاءَكَ مِنَ الْعِلْمِ فَقُلْ تَعَالَوْا نَدْعُ أَبْنَاءَنَا وَأَبْنَاءَكُمْ وَنِسَاءَنَا وَنِسَاءَكُمْ وَأَنفُسَنَا وَأَنفُسَكُمْ ثُمَّ نَبْتَهِلْ فَنَجْعَل لَّعْنَتَ اللَّهِ عَلَى الْكَاذِبِينَ ۝

"ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమ్‌ను మట్టితో చేసి, "అయిపో" అని ఆజ్ఞాపించాడు. అతను అయ్యాడు. అసలు వాస్తవం ఇది. అది మీ ప్రభువు తరఫు నుండి మీకు తెలుపబడుతోంది. దాన్ని శంకించే వారిలో నీవు చేరిపోకు. ఈ ఆజ్ఞ వచ్చిన తరువాత ఇక నీతో ఎవరైనా ఈ విషయంలో వివాదానికి దిగితే, ప్రవక్తా! వారితో ఇలా అను: రండి! మీరు మేము స్వయంగానూ వద్దాము. మన ఆలుబిడ్డలను కూడా పిలుచుకు వద్దాము. అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక అని ప్రార్థిద్దాం." (3 : 59,60,61)

https://teluguislam.net



తెల్లవారిన తరువాత మహాప్రవక్త (స), ఈ దైవవాణి వెలుగులో హజ్రత్ ఈసా (అ.స.)ను గురించి వారడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చి ఆ రోజు వారిని ఆలోచించుకొమ్మని స్వతంత్రంగా వదలివేశారు. కాని వారు ఈసా (అ.స.)ను గురించి దైవప్రవక్త (స) ఇచ్చిన వివరణను స్వీకరించడానికి సిద్ధంగా లేరు. రెండో రోజు తెల్లవారిన తరువాత - అప్పటికే ఆ ప్రతినిధి వర్గం వారు హజ్రత్ ఈసా (అ.స.)ను గురించి ఆయన (స) చెప్పిన మాటలను నిరాకరించారు గనుక - మహాప్రవక్త (స) వారిని 'ముబాహిలా' (అసత్యం పలికేవారిపై దైవశాపం పడుగాక అనే ప్రమాణం చేయుట.) (Mutual imprecation to prove truth of one's point) కోసం ఆహ్వానించారు. హజ్రత్ హసన్ మరియు హుసైన్ (ర)లు దైవప్రవక్త మనుమలను తన దుప్పటితో కప్పుకొని బయలుదేరారు ముబాహిలా కోసం. వెనుకగా హజ్రత్ ఫాతిమా (ర) కూడా నడిచి వస్తున్నారు. మహాప్రవక్త (స) సిద్ధమై 'ముబాహిలా' కోసం వస్తున్న దృశ్యాన్ని చూసి వారు ఏకాంతంలోనికి వెళ్ళి చర్చించుకోనారంభించారు. ఆఖిబ్ మరియు సయ్యద్‌లు పరస్పరం, "చూడండి, ముబాహిలాకు దిగవద్దు. దైవసాక్షి! ఒకవేళ ఈయన ప్రవక్తే అయితే మనం గనక ఆయనతో తలపడితే మనంగాని, మన సంతానంగాని ఎంతమాత్రం సాఫల్యం పొందలేము. భూమండలం మీదవున్న ఒక్క వెంట్రుక, ఒక్క గోరు కూడా వినాశానికి గురి కాక తప్పదు. దైవప్రవక్త(స)కే మన విషయంలో న్యాయ నిర్ణేతగా వదిలేద్దాం" అని అనుకొని ఆయన(స) సన్నిథికి తిరిగి హాజరైనారు. "తమరు అడిగింది మేమివ్వడానికి సిద్ధం" అని విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని మన్నించి మహాప్రవక్త (స) వారి నుండి జిజియా తీసుకునే షరతును పెట్టారు. అదేకాకుండా రెండు వేల జతల బట్టలు కూడా ఇవ్వాలని ఒప్పందం కుదుర్చు కుంటూ, ప్రతి బట్టల జతతోపాటు ఒక ఓకియా (నూటా యాభై రెండున్నర గ్రాముల వెండి) కూడా ఇవ్వాలని షరతు పెట్టారు. ఆ ఒప్పందంలో ఒక వేయి జతల బట్టలు రజబ్ నెలలోను, మిగిలిన వెయ్యి జతల బట్టలు సఫర్ నెలలోను ఇవ్వవలసి ఉంటుంది. ఈ విషయంలో మహాప్రవక్త (స) వారికి ఓ పత్రం కూడా రాసిచ్చారు. వారు తిరిగి వెడుతూ, ఓ అమీన్‌ను (అమానతుదారుడు అయిన వ్యక్తిని) పంపించమని కోరగా దైవప్రవక్త (స), ఒప్పందంలో కుదుర్చుకున్న సొమ్మును వసూలు చేయడానికి ముస్లిముల

https://teluguislam.net



అమీన్ అయిన హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (ర)ను అక్కడికి పంపించారు.

ఆ తరువాత నజ్రాన్ వారిలో ఇస్లామ్ ధర్మం వ్యాపించనారంభించింది. చరిత్రకారుల కథనం ప్రకారం, సయ్యద్ మరియు ఆఖిబ్‌లు నజ్రాన్‌కు వెళ్ళగానే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. వారి నుండి సదఖాలు వసూలు చేయడానికి మహాప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను అక్కడికి పంపించడం జరిగింది. సదఖా అనేది ముస్లిముల నుండే వసూలు చేయబడుతుందన్న విషయం మనకు తెలిసిందే.[8]

## 13. బనీ హనీఫా ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం హిజ్రీ శకం 9లో మదీనాకు వచ్చింది. ఇందులో 'ముసైలమా కజ్జాబ్'తో సహా డెబ్భై మంది ప్రతినిధులున్నారు.[9] ముసైలమా వంశ వృక్షం ఇలా ఉంది; ముసైలమా తండ్రి సమామా, సమామా తండ్రి కబీర్, అతని తండ్రి హుబైబ్, హుబైబ్ తండ్రి హారిస్ (ముసైలమా బిన్ సమామా బిన్ కబీర్ బిన్ హుబైబ్ బిన్ హారిస్.) ఈ ప్రతినిధులంతా ఓ అన్సారీ సహాబీ ఇంటికొచ్చి దిగారు. ఆ తరువాత దైవప్రవక్త (స) సన్నిధికి హాజరై ఇస్లామ్ స్వీకరించి ముస్లిములై పోయారు. అయితే ముసైలమా కజ్జాబ్ విషయంలో ఉల్లేఖనాల్లో తేడా ఉంది. ఉల్లేఖనాలన్నిటినీ పరిశీలిస్తే, అతడు గర్వాన్ని, అహాన్ని మరియు పెత్తనం కోరికను ప్రకటించినట్లు తెలుస్తోంది. ప్రతినిధి వర్గంలోని తక్కిన సభ్యులంతా మహాప్రవక్త (స) వద్దకు వచ్చారు. మహాప్రవక్త (స) మొదట మాటల ద్వారా, చేతల ద్వారా వారి ఎడల గౌరవంగా ప్రవర్తించి వారి మనసుల్ని ఆకట్టుకున్నారు. అయితే వారిలో ఓ వ్యక్తిపై ఈ వైఖరి ఎలాంటి ప్రభావం చూపడంలేదని గ్రహించి ఆయన దూరాలోచన ద్వారా అతనిలో కీడు ఉందని గ్రహించారు.

---

8. *ఫత్‌హుల్ బారి - 8/94,95; జాదుల్ ముఆద్ - 3/38-41; నజ్రాన్ ప్రతినిధి వర్గం గురించిన వివరాల ఉల్లేఖనాల్లో కొంత అయోమయం ఉంది. ఈ కారణంగానే కొందరు పరిశోధకులు నజ్రాన్ ప్రతినిధి వర్గం రెండుమార్లు మదీనాకు వచ్చిందని అంటారు. కాని మేము పైన చెప్పిన విషయమే సరిఅయినదని నమ్ముతున్నాం.*
9. *ఫత్‌హుల్ బారి-8/87.*

https://teluguislam.net



అంతకు పూర్వమే మహాప్రవక్త (స) ఓ కలగన్నారు: ఆయన సమక్షంలో భూమండలంలోని ధనాగారాలన్ని తెచ్చిపెట్టబడడం, అందులో నుండి రెండు బంగారు కంకణాలు ఆయన చేతుల్లోనికి వచ్చి పడడమూ, ఈ రెండు విషయాలు ఆయన్ను మనస్తాపానికి గురిచేయడమూ, వాటిని ఊది పారెయ్యమని దైవవాణి ద్వారా తెలియజేయబడడం, ఆయన అలా చేయగా ఆ రెండూ ఎగిరిపోవడమూ చూసి ఉన్నారు ఆ స్వప్నంలో.

ఆ స్వప్నానికి అర్థం చెబుతూ మహాప్రవక్త (స), నా తరువాత ఇద్దరు కజ్జాబ్‌లు (అత్యంత అబద్ధాలకోరులు, అసత్యవంతులు) బయలుదేరగలరని చెప్పారు. ముసైలమా కజ్జాబ్ తన నీల్గును, తిరస్కారాన్ని ప్రకటించడాన్ని చూసి- అతని వాదన ప్రకారం, మహాప్రవక్త (స) తన తరువాత పాలనాధికారాలను తనకు అప్పజెబితేనే నేను ఆయన్ను అనుసరిస్తాను అన్నది- అతని వద్దకు వెళ్ళారు. ఆయన చేతిలో ఖర్జూరపు చువ్వ ఒకటుందప్పుడు. ఆయన వెంట సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమాస్ (ర) కూడా ఉన్నారు. ముసైలమా తన మిత్రుల వద్ద కూర్చుని ఉండగా మహాప్రవక్త (స) అతని దగ్గరకు వెళ్ళి నిలబడ్డారు. మాటల సందర్భంలో అతను, “మీరనుకుంటే మేము మిమ్మల్ని పరిపాలనా విషయంలో స్వతంత్రులుగా వదిలేస్తాము. అయితే ఆ పాలనా బాధ్యతను మీరు మీ తరువాత నాకు అప్పగించాల్సి ఉంటుంది” అన్నాడు. అతని ప్రేలాపనలు విన్న మహాప్రవక్త (స) (ఖర్జూరపు చువ్వను చూపిస్తూ), “ఒకవేళ నీవు నన్ను ఈ పుల్లను ఇవ్వమని అడిగినా నీకు ఇచ్చేవాణ్ణి కాను. నీవు నీ విషయంలో అల్లాహ్ నిర్ణయాన్ని దాటిపోలేవు. నీవే గనక తిరస్కరిస్తే అల్లాహ్ నిన్ను విరిచి పారేస్తాడు. దైవసాక్షి! అల్లాహ్ నాకు చూపించిన కలలోని వ్యక్తిగానే తలుస్తున్నాను నిన్ను. ఇదిగో! ఈ సాబిత్ బిన్ ఖైస్ ఉన్నారు చూశావు! నా తరపున నీకు సమాధానం చెబుతారు విను” అని అక్కడి నుండి వెళ్ళిపోయారు.[10]

చివరికి దైవప్రవక్త (స) తన దూరదృష్టి ద్వారా వేసిన అంచనాయే నిజమైంది. అంటే ముసైలమా కజ్జాబ్ ‘యమామా’కు తిరిగి వెళ్ళి, మొదట బాగా ఆలోచించుకొని, తనను దైవప్రవక్త (స)గారికి భాగస్వామిగా ప్రవక్త

*10. చూడండి, సహీ బుఖారి - 2/627, 628; ఫత్‌హుల్ బారి - 8/87 - 93*

https://teluguislam.net



పదవిలో చేర్చుకోవడం జరిగిందని ప్రకటించేశాడు. తాను ప్రవక్తనని ప్రకటించే రెండు పాదాలు కలిగి సమప్రాసలతో కూడిన 'సజ్జా' (ద్విపది) కవితను చెప్పనారంభించాడు. తన జాతి కోసం వ్యభిచారం మరియు మత్తుపానీయ సేవనాన్ని ధర్మసమ్మతం చేశాడు. దీనితోపాటే దైవప్రవక్త ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్తే అని సాక్ష్యం కూడా ఇస్తూ ఉంటే ప్రజలు మోసపోయి అతనికి విధేయులై, అతని అడుగులకు మడుగులొత్తనారంభించారు. ఫలితంగా అతని వ్యవహారం మరింత గడ్డుగా మారిపోయింది. ప్రజలు అతణ్ణి 'యమామా రహ్మాన్'గా పిలిచేటంత వరకు పెరిగిపోయింది అతని పలుకుబడి. ముసైలమా కజ్జాబ్ ప్రవక్త (స) గారికి ఓ లేఖ రాసి పంపాడు. "నన్ను ఈ కార్యంలో మీకు భాగస్వామిగా చేయడం జరిగింది. సగం పాలనాధికారం నాది, మరో సగం ఖురైష్‌ది" అని చెప్పే సాహసానికి దిగాడు ఆ లేఖలో. దీనికి జవాబుగా మహాప్రవక్త (స) అతనికి ఓ లేఖ రాస్తూ, "భూమి అల్లాహ్‌ది. ఆయన తన దాసుల్లో కోరిన వారికి దానికి వారసునిగా చేస్తాడు. సత్ఫలితాలు ఆయనకు భయపడేవారి కోసమే"[11] అని చెప్పారు.

ఇబ్నె మస్ఊద్ (ర) గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది:

ఇబ్నె నవాహా మరియు ఇబ్నె అసాల్ ఇద్దరూ ముసైలమా దూతలుగా మహాప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చినవారు. దైవప్రవక్త (స) వారితో, "నేను దైవప్రవక్తననే విషయాన్ని మీరు ధృవీకరిస్తున్నారా?" అని అడుగగా వారు, "మేము ముసైలమాయే అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యం ఇస్తున్నాం" అని బదులు పలికారు. వారి జవాబు విన్న మహాప్రవక్త (స), "నేను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించినవాణ్ణి. ఏ దూతనైనా సంహరించదలుచుకుంటే ముందు మీ ఇద్దరిని సంహరించేవాణ్ణి"[12] అన్నారు.

ముసైలమా కజ్జాబ్ హిజ్రీ శకం 10లో తాను ప్రవక్తనని ప్రకటించు కున్నాడు. రబీఉల్ అవ్వల్ మాసం హి.శ. 12లో అబూ బక్ర్ సిద్దీఖ్ (ర) గారి ఖిలాఫత్‌లో అతను యమామాలో చంపబడ్డాడు. అతణ్ణి చంపినవారు వహ్షీ. వహ్షీ, హజ్రత్ హమ్జా (ర)ను హతమార్చినవారు.

---

11. జాదుల్ ముఆద్- 3/31,32. 12. ముస్నదె అహ్మద్, మిష్కాత్ - 2/347.

https://teluguislam.net



ప్రవక్తగా ప్రకటించుకున్న వాడు ఇతను ఒకడైతే, అతని అంతం అలా జరిగింది. అసత్య ప్రవక్తగా ప్రకటించుకున్నవాడు మరొకడున్నాడు. అతని పేరు అస్వద్ అన్సీ. ఇతను యమన్ దేశంలో కల్లోలాన్ని రేకిత్తించినవాడు. అతణ్ణి దైవప్రవక్త (స) మరణానికి ఓ పగలు ఓ రేయికి ముందు హజ్రత్ ఫేరోజ్ (ర) చంపేశారు. అతడు సంహరించబడినట్లు మహాప్రవక్త (స)కు దైవవాణి (వహీ) ద్వారా తెలిసింది. ఆయన (స) అతని సంహారం గురించిన సంఘటన సహాబా (ర)కు తెలియజేశారు. ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి దగ్గరకు అతని అంతం గురించిన నిర్ధారణ వార్త వచ్చింది.[13]

## 14. బనీ ఆమిర్ బిన్ సాసఅ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గంలోని దైవవిరోధి ఆమిర్ బిన్ తుఫైల్, హజ్రత్ లబీద్ (ర)గారి మారుసోదరుడు. అర్బద్ బిన్ ఖైస్ మరియు ఖాలిద్ బిన్ జాఫర్, జబ్బార్ బిన్ అస్లమ్‌లున్నారు. వీరంతా తమ జాతికి చెందిన పరమ దుష్టులైన సర్దారులు. బైరె మఊనాలో డెబ్భై మంది సహాబా (ర)లను షహీద్ చేయించిన వాడే ఆ ఆమిర్ బిన్ తుఫైల్. వారంతా మదీనాకు బయలుదేరే ముందు, ఆమిర్ మరియు అర్బద్‌లు, దైవప్రవక్త (స)ను మోసగించి చంపేసే ఎత్తుగడ పన్ని అక్కడికి వచ్చినవారు. ఈ ప్రతినిధి వర్గం మదీనాకు వచ్చి మహాప్రవక్త (స)తో మంతనాలకు దిగారు. అర్బద్ దొంగమాటుగా దైవప్రవక్త (స) వెనుకకు వచ్చి ఒర నుండి కరవాలాన్ని జానెడు పైకి లాగాడు. కాని అల్లాహ్ అతని చేతిని అక్కడే నిలువరించాడు. అతను ఆ కరవాలాన్ని పూర్తిగా బయటకు లాగలేకపోయాడు. అలా అల్లాహ్ తన ప్రవక్తను వారి బారి నుండి రక్షించాడు. మహాప్రవక్త (స) ఆ ఇద్దరిని శపించగా తిరుగు ప్రయాణంలో అల్లాహ్, అర్బద్ మరియు అతని ఒంటెపై పిడుగు పడవేయగా అతను అక్కడికక్కడే కాలిబూడిదయ్యాడు. ఇటు ఆమిర్ ఓ సలూలియా స్త్రీకి అతిథి అయ్యాడు. అప్పుడే అతని మెడ మీద ఓ బొబ్బ పుట్టింది. ఆ బొబ్బ కారణంగా అతను ప్రాణాలు వదిలాడు. ప్రాణాలు వదిలేటప్పుడు అతడు, "అయ్యో! ఒంటె గడ్డలాంటి బొబ్బ ఇది. అది కూడా ఓ సలూలియా స్త్రీ ఇంట్లో పుట్టిన బొబ్బ. నేను ఆమె ఇంట చనిపోతున్నానే" అని అంటూ ప్రాణాలు వదిలాడు.

13. ఫత్‌హుల్ బారి - 8/93

https://teluguislam.net



సహీహ్ బుఖారి కథనం ప్రకారం, ఆమిర్ దైవప్రవక్త (స) వద్దకు వచ్చి ఇలా అన్నాడు:

"నేను మీకు మూడు విషయాల అధికారం ఇస్తున్నాను. 1) మీ కోసం వాది (లోయ)లో ఉన్న ప్రజలు; నా కోసం ఈ జనావాసంలోనివారు. 2) లేదా నేను మీ తరువాత ఖలీఫా అవుతాను. 3) అలా కాని పక్షంలో నేను గత్ఫాన్ తెగవారికి వెయ్యి మగ గుర్రాలు, వెయ్యి ఆడ గుర్రాలనిచ్చి మీ మీద దాడి చేయడానికి తీసుకొని వస్తాను" అని బెదిరించాడు. ఆ తరువాత అతను ఓ స్త్రీ ఇంట ప్లేగు వ్యాధికి గురైనాడు. (ఆ దుఃఖంలో అతను, ఏమిటి ఒంటెపై ఉబికిన గడ్డ లేదా బొబ్బలాంటిది నాకు పుట్టడమా? అది కూడా ఫలానా వారి స్త్రీ ఇంటిలోనా? నా వద్దకు నా గుర్రాన్ని తీసుకురండి అని చెప్పాడు. గుర్రానెక్కి ఆ గుర్రం మీదనే ప్రాణాలు వదిలేశాడు.)

## 15. తజీబ్ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం, తమ జాతి నుండి వసూలు చేసిన సదఖాలను పేదలకు పంచిపెట్టగా మిగిలినవి తన వెంట మదీనాకు తెచ్చింది. ఇందులో మొత్తం పదముగ్గురు వ్యక్తులున్నారు. వారు ఖుర్ఆన్ మరియు ప్రవక్త (స)గారి సంప్రదాయాలను ప్రజలను అడిగి నేర్చుకుంటూ ఉండేవారు. వారు మహాప్రవక్త (స)ను కొన్ని విషయాలనడిగారు. వాటిని ఆయన (స) వారికి రాసి ఇచ్చారు. ఆ ప్రతినిధి వర్గం మరింత కాలం అక్కడ ఆగలేదు. వెళ్ళేటప్పుడు మహాప్రవక్త (స) వారికి కానుకలు ఇవ్వగా వారు, డేరా వెనుకన ఉన్న ఓ యువకుణ్ణి కూడా ప్రవక్త (స) వద్దకు పంపించారు. ఆ యువకుడు ప్రవక్త (స) వద్దకు హాజరై, "దైవప్రవక్తా! దేవుని సాక్షి! తమరు నా కోసం దుఆ చేస్తారనే ఉద్దేశ్యం తప్ప మరే ఉద్దేశ్యంతోనూ నేను నా ప్రాంతం నుండి ఇక్కడికి రాలేదు. తమరు నా గురించి అల్లాహ్‌ను, నన్ను మన్నించి నాపై కారుణ్యాన్ని కురిపించమని, నా కలిమిని నా మనస్సులోనే ఉండేటట్లు చేయమని ప్రార్థించండి" అని విన్నవించుకున్నాడు. దైవప్రవక్త(స)అతని కోసం ప్రార్థించారు. ఫలితంగా అతడు ఇతరుల కంటే నిరపేక్షాపరుడైపోయాడు. ధర్మభ్రష్టత్వపు గాలి వీచినప్పుడు అతను ఇస్లామ్ ధర్మం మీదే స్థిరంగా

https://teluguislam.net



ఉండడమే కాకుండా తన జాతివారికి హితోక్తులు చెప్పడం వల్ల వారు కూడా ఇస్లామ్ ధర్మాన్ని వదలకుండా స్థిరంగా ఉండిపోయారు. ఈ ప్రతినిధి వర్గంలోని సభ్యులు, హిజ్రీ శకం 10లో దైవప్రవక్త (స) హజ్జతుల్ విదాకు వెళ్ళినప్పుడు మరోసారి వెళ్ళి ఆయన్ను కలిశారు.

## 16. తై తెగవారి ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం సభ్యుల్లో ప్రఖ్యాత అరబ్బు యోధుడు జైదుల్ ఖైల్ కూడా ఉన్నారు. వారంతా కలసి దైవప్రవక్త (స)తో మాట్లాడారు. ఆయన (స) వారిని ఇస్లామ్ స్వీకరించమని కోరగా వారంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి నిజమైన ముస్లిములుగా మారిపోయారు. దైవప్రవక్త (స) జైద్‌ను పొగుడుతూ, "నాకు అరేబియాలోని ఆయా వ్యక్తులలోని గొప్పదనాలను గురించి చెప్పడం జరిగింది. అయితే ఆ వ్యక్తులు నా వద్దకు వచ్చినప్పుడు ప్రజలు అనుకున్నంత గొప్పదనాలు వారిలో అగుపడలేదు. కాని దానికి భిన్నంగా జైదుల్ ఖైల్ ఖ్యాతి మాత్రం వారికంటే గొప్పది" అని సెలవిచ్చారు. ఆయన పేరును మార్చి జైదుల్ ఖైర్‌గా పెట్టడం జరిగింది.

ఈ విధంగా, హిజ్రీ శకం 9 మరియు 10లలో ముమ్మరంగా ప్రతినిధి వర్గాలు మదీనాకు వచ్చాయి. సీరత్ చరిత్రకారులు, పైన చెప్పిన ప్రతినిధి వర్గాలే కాకుండా మరికొన్ని ప్రతినిధి వర్గాల గురించి వివరించడం జరిగింది. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

అవి, యమన్, అజ్ద్ ఖుజాఅలకు చెందిన బనీ సఅద్, హుజైమ్, బనీ ఆమిర్ బిన్ ఖైస్, బనీ అసద్, బహ్రా, కూలాన్, మహారిబ్, బనీ హారిస్ బిన్ కఅబ్, గామిద్, బనీ మున్తఫిక్, సలామాన్, బనీ అబస్, యజీనా, మరాద్, జుబైద్, కిందా, జీమర్రాహ్, గస్సాన్, బనీ ఈష్ మరియు నఖ్‌హాలు. నఖ్‌హా ప్రతినిధి వర్గం చివరిది. అది ముహర్రం నెల హి.శ. 11 మధ్యభాగంలో వచ్చిన ప్రతినిధి వర్గం. వీరంతా రెండొందల మంది. తక్కిన అనేక ప్రతినిధి వర్గాలు హిజ్రీ శకం 9 మరియు 10లో వచ్చాయి. కొన్ని ప్రతినిధి వర్గాలు మాత్రమే హిజ్రీ శకం 11 వరకు రాకుండా ఆగాయి.

ఈ ప్రతినిధి వర్గాలు ఒకదాని తరువాత మరొకటి మదీనాకు

https://teluguislam.net



వచ్చాయంటే, అప్పటి ఇస్లామీయ సందేశ ప్రచారం ఎంత ఊపందుకుందో, దానికి ఎంత జనరంజకత్వం లభించిందో అర్థం చేసుకోవచ్చు. అరబ్బులు మదీనా నగరాన్ని ఎంతగా గౌరవించేవారో, దానికి లొంగిపోవడం తప్ప మార్గాంతరం మరేదీ లేదని తలచేవారో దీని ద్వారా మనం అంచనాగట్టవచ్చు. యదార్థం ఏమిటంటే, మదీనా నగరం అరేబియా ద్వీపానికే రాజధానిగా మారిపోయింది. దాన్ని ఉపేక్షించడం ఇక ఎవరి తరమూ కాలేదు. అయితే, అందరి మనస్సులపై ఇస్లామ్ ధర్మప్రభావం పడిందని మేము చెప్పలేం. ఎందుకంటే, వారిలో అనేకమంది మొదట బద్దూలు (పల్లెవాసులు). కేవలం తమ సర్దారులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినందుకు వారిని అనుకరిస్తూ ముస్లిములైనవారు. వారిలో ఇదివరకు చోటుచేసుకొని ఉన్న అజ్ఞాన కాలపు రుగ్మతలన్నీ వేళ్ళూనుకునే ఉన్నాయి. అవి పూర్తిగా వారి నుండి తుడిచి పెట్టుకుపోలేదు. ఇస్లామీయ బోధనలు వారిని ఇంకనూ నాగరికులుగా తీర్చి దిద్దలేదు. కాబట్టి దివ్యఖుర్ఆన్ తౌబా సూరాలో ఆ కొందరు వ్యక్తుల దుర్గుణాల గురించి ఇలా చెప్పడం జరిగింది.

اَلْاَعْرَابُ اَشَدُّ كُفْرًا وَّنِفَاقًا وَّاَجْدَرُ اَلَّا يَعْلَمُوْا حُدُوْدَ مَآ اَنْزَلَ اللّٰهُ عَلٰى رَسُوْلِهٖ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ۝ وَمِنَ الْاَعْرَابِ مَنْ يَّتَّخِذُ مَا يُنْفِقُ مَغْرَمًا وَّيَتَرَبَّصُ بِكُمُ الدَّوَآئِرَ ؕ عَلَيْهِمْ دَآئِرَةُ السَّوْءِ ؕ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ۝

"ఈ ఎడారి అరబ్బులు విశ్వాసం విషయంలో, కాపట్యం విషయంలో బహు మూర్ఖులు. కనుక అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన ధర్మం యొక్క హద్దులు వారికి తెలియకుండా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అల్లాహ్‌కు అన్నీ తెలుసు. ఆయన జ్ఞానీ, వివేకవంతుడూను."

**(9 : 97,98)**

ఇది ఇలా ఉండగా ఇతరులను పొగడడం కూడా జరిగింది. వారిని గురించి చెబుతూ దివ్యఖుర్ఆన్ ఇలా సెలవిస్తోంది.

وَمِنَ الْاَعْرَابِ مَنْ يُّؤْمِنُ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ وَيَتَّخِذُ مَا يُنْفِقُ

https://teluguislam.net



قُرُبٰتٍ عِنْدَ اللّٰهِ وَصَلَوٰتِ الرَّسُوْلِ ؕ اَلَاۤ اِنَّهَا قُرْبَةٌ لَّهُمْ ؕ سَيُدْخِلُهُمُ اللّٰهُ فِىْ رَحْمَتِهٖ ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ

"ఈ ఎడారి అరబ్బుల్లోనే ఇంకా కొంత మంది ఉన్నారు; వారు అల్లాహ్‌ను అంతిమ దినాన్నీ విశ్వసిస్తారు, తాము ఖర్చు చేసే దానిని, అల్లాహ్ సాన్నిహిత్యం పొందడానికి, ప్రవక్త నుండి దేవుని కారుణ్యానికై ప్రార్థనలు పొందడానికి సాధనంగా చేసుకుంటారు. అవును! అది నిశ్చయంగా అల్లాహ్ సాన్నిహిత్యాన్ని పొందడానికి సాధనమే. అల్లాహ్ తప్పకుండా వారిని తన కారుణ్యంలోకి ప్రవేశింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను." (9 : 99)

మక్కా, మదీనా, సఖీఫ్, యమన్ మరియు బహ్రెయిన్ల ప్రజల విషయానికి సంబంధించినంత మట్టుకు, వారిలో ఇస్లామ్ దృఢంగా నాటుకు పోయింది. వారిలో నుండే పేరుమోసిన సహాబాలు ఉద్భవించారు.[14]

---

*14. ఈ మాటలు కిజ్రీ తన ముహాజిరాత్ గ్రంథంలో ఉటంకించిన మాటలు 1/144. ఏ ప్రతినిధి వర్గాలను గురించి అయితే వివరణ లభించిందో ఆ గ్రంథాలు ఇవి: సహీ బుఖారి - 1/13, 2/626 - 630; ఇబ్నె హష్షామ్ - 2/501 - 503, 510 - 514, 537 - 546, 560 - 601; జాదుల్ ముఆద్ - 3/26 - 60; ఫత్‌హుల్ బారి - 8/83 - 103; రహ్మతుల్ లిల్ ఆలమీన్ 1/184 - 217.*